నేడు స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఎదులాపురం, జూలై 8 : తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ మహేందర్ జిత్ కుమార్, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలోని ఈత కొలనులో ఉదయం 10 గంటలకు పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. మొదటి విభాగంలో 15,16,17 సంవత్సరాలు, రెండవ విభాగంలో 12,13,14, మూడవ విభాగంలో 10,11 సంవత్సరాల పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ బృందాన్ని సంప్రదించాలని సూచించారు.

వ్యాపార సముదాయ రూముల వేలం వాయిదా

ఇంద్రవెల్లి, జూలై 8 : ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యాపార సముదాయ రూముల వేలంను వాయిదా వేసినట్లు ఈవో సంజీవరావ్ తెలిపారు. సోమవారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు వ్యాపార సముదాయ రూములకు వేలం పాట నిర్వహించారు. వేలం పడేందుకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. తిరిగి వేలం పాట త్వరలోనే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి మేక మృతి

భైంసా, జూలై 8 : భైంసాలోని కుభీర్ చౌరస్తా వద్ద విద్యుత్ తీగలు తగిలి సోమవారం భట్టిగల్లీకి చెందిన శ్రీను అనే రైతు మేక మృతి చెందింది. దీని విలువ రూ. 15వేల వరకు ఉంటుంది. సంబంధిత అధికారులు రైతుకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి యత్నం

భైంసా, జూలై 8: భైంసాలోని పద్మావతి కాలనీలో గల లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఓ దుండగుడు ఆదివారం అర్ధరాత్రి హుండీని పగలగొట్టి చోరీకి యత్నించాడు. ఆలయం నుంచి శబ్దాలు రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండగుడిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దరఖాస్తు చేసుకోవాలి

కుంటాల, జూలై 8: కుంటాలలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులలో అడ్మిషన్ కోసం తెలుగు మీడియంలోని బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో మిగిలి ఉన్న ఖాళీలకు విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తుకారాం కోరారు. ఉచిత అడ్మిషన్ పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందని పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలి

బోథ్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా(పంటల బీమా) యోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పంటల బీమా పథకాన్ని ఎలాంటి నియమ నిబంధనలు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. రైతులను రాజుగా చూస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. సమావేశంలో రైతులు శేఖర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, మన్ను పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూలై 8 : ఖానాపూర్ రెవెన్యూలో పని చేస్తున్న ఎంసీపై చర్యలు తీసుకోవాలని మాక్సిట్స్ కమ్యూనిటీ పార్టీ ఆధ్వర్యంలో పాత ఎల్లాపూర్ గ్రామస్తులు సోమవారం నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సెక్రటరీ ఆలెపు పీటర్ మాట్లాడుతూ పాత ఎల్లాపూర్ శివారులోని సర్వే నంబర్ 344, 345 లక్ష్మీభవాని భూమి అమ్మడం కొనడం జరిగిందని చుట్టు పక్కల సర్వే నంబర్లు గల వారికి తప్పుడు సమాచారం ఇచ్చి వారి మధ్య ఘర్షనలు చోటు చేసుకునేలా అధికారి చూస్తున్నారని అన్నారు. నిర్మల్ జిల్లాలో డీ వన్ పట్టాలు, శేత్వారి పట్టాలపై విచారణ జరపాలని కోరారు. ఇక్కడ రైతు సంఘం జిల్లా నాయకులు సురేందర్, మహిళా సంఘం జిల్లా నాయకురాలు స్వరూప ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తానూర్, జూలై 8 : గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఝరి(బీ) గ్రామస్తులు సోమవారం భైంసాలో ఎంపీ గోడం నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి వంతెన లేక వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతాయని, గ్రామంలో పోస్టాఫీస్ మంజూరు, పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీ, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ ఝరి(బీ) వీడీసీ సభ్యులు, నాయకులు బాలాజీ, చక్రదర్ పటేల్, దిగంబర్, ఆసం మాధవ్, గైక్వాడ్ సాయినాథ్ ఉన్నారు

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

భైంసాటౌన్, జూలై 8 : భైంసా మండలం సుంక్లి గ్రామంలో కుక్కలు ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన నర్సయ్య, ముత్యం, సాగరలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు గమనించి వారిని భైంసా ఏరియా దవాఖానకు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరి మృతి

నేరడిగొండ, జూలై 8 : నేరడిగొండ సమీపంలోని లకంపూర్ బస్ స్టాప్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని, ఒకరు మృతి చెందాడు. మృతుడి ఒంటిపై నల్లని చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అలాగే చేతిపై అమ్మ అనే పేరు రాసి ఉంది. మిగతా వివరాల కోసం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ శ్రీకాంత్ ఎస్ఐ కోరారు. మృత దేహాన్ని బోథ్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

కేజీబీవీ సందర్శన

బజార్‌హత్నూర్, జూలై 8 : బజార్‌హత్నూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం నాయబ్ తహసీల్దార్ శ్యాంసుందర్ సందర్శించారు. పాఠశాలలోని వసతిగృహంలోని నిత్యావసర సరుకుల నిల్వగల స్టోర్‌రూం, వంటశాలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాక్ నిల్వల వివరాలునమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

కైలాష్ టికిడి రోడ్డు నిర్మాణానికి సర్వే

బోథ్, జూలై 8 : మండలంలోని కైలాష్ టికిడి రోడ్డు నిర్మాణ పనుల కోసం సోమవారం రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి అటవీ ప్రాంతం గుండా కైలాష్ టికిడి వరకు ఐదు కిలో మీటర్ల రోడ్డు కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నిగిని ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కైలాష్ టికిడి వరకు ఉన్న ఐదు కిలో మీటర్ రోడ్డు అటవీ ప్రాంతం గుండా ఉండడంతో ఆ శాఖ అనుమతి కోసం నివేదిక సమర్పించేందుకు విలుగా సర్వే చేపట్టారు. సర్వేలో డీఈ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నిర్మల్ అర్బన్ : అర్జీలను సమర్పిస్తున్న ఫిర్యాదుదారులు

నిర్మల్ అర్బన్, జూలై 8 : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న జిల్లా ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇతర భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని, సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని, వివిధ వసతి గృహాల్లో విద్యార్థులకు ఫీవర్ సర్వేను నిర్వహించి రిపోర్టును అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్‌వో భుజంగ్‌రావ్ పాల్గొన్నారు.

అధికారులు దృష్టి సారించాలి

అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, జూలై 8 : దర్బార్‌కు వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో అర్జీలను స్వీకరించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని తలమడుగు మండలం రేకులగూడేం గ్రామానికి చెందిన ఆత్రం అయ్యూబాయి తనకు రైతుబంధు రావడం లేదని, జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనకి గోపాల మిత్ర సెంటర్ కావాలని, కాజీపేట్ మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ తనకు ఏదైన ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని, నేరడిగొండ మండలానికి చెందిన రూపాబాయి ఆర్థిక సహాయం కావాలని అర్జీలను సమర్పించారు. ఈ దర్బార్‌లో ఏపీవో కనక భీంరావు, జీసీసీ డీఎం రామనందం, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్, ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

ఫిర్యాదులను స్వీకరిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జూలై 8 : బాధితులకు జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు ఎస్పీకి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పోలీసు సహాయం కావాలనుకునే వారు 8712659599 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

ఎదులాపురం : కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఎదులాపురం, జూలై 8 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సోమవారం ఆదిలాబాద్‌లోని వృద్ధాశ్రమంలో నిర్వహించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మావల మండలాధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయులు దామోదర్ రెడ్డి, నవీన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రంజిత్‌రెడ్డి కుర్ర నరేశ్, ఆదిత్య పాల్గొన్నారు.

ఉట్నూర్, జూలై 8: ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, నాయకులు ఎస్సీ రెడ్డి, ఎక్బాల్, సలీం, ప్రభాకర్, ఓమేశ్, స్వామి, సుశీల్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జూలై 8: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, నాయకులు సోమాసే వెంకట్‌రావ్, నాగ్‌నాథ్, యాకుబ్‌బేగ్, నాగోరావ్ పాల్గొన్నారు.

బోథ్, జూలై 8 : బోథ్‌లో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, మహేందర్, భోజన్న, వంశీ రెడ్డి, అబ్రర్, శేఖర్, గంగారం, షాకీర్ పాల్గొన్నారు.



భైంసా: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

భైంసా, జూలై 8 : పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఓం ప్రకాశ్ లడ్డా, నాయకులు చంద్రకాంత్ యాదవ్, రాంచందర్ రెడ్డి, రాకేశ్, భోజరాం పటేల్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు శంకర్ చంద్రే పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా

మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

భైంసా, జూలై 8 : ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి తనవంతు కృషి చేస్తానని ఎంపీ నగేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన నాయకులు, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ గుండేగాం పునరావాసం, పిప్రి ఎత్తిపోతల, బాసర ఆలయ అభివృద్ధికి, రైల్వే స్టేషన్‌లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. బాసర నుంచి మహోర్ వరకు రహదారి అనుసంధానానికి సైతం కృషి చేయాలని ఎంపీ నగేశ్‌ను కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, సొంపల్లి రమేశ్, భీంరావ్, పండిత్ రావు, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, గాలి రవి పాల్గొన్నారు.

నేడు దినసంత వేలం పాట

ఇచ్చోడ, జూలై 8 : ఇచ్చోడ గ్రామ పంచాయతీ పరిధిలోని దినసంత వేలం పాట ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ తెగల కులానికి చెందిన, ఇచ్చోడ స్థానికులు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

కురిసిన వర్షం

నార్నూర్ : లోకారి(కే) కల్వర్టులో ఇరుకుపోయిన ఆటోను బయటకు తీస్తున్న ప్రయాణికులు

ఉట్నూర్, జూలై 8: ఉట్నూర్ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. శ్యాంనాయక్ తండా గ్రామంలోని రాథోడ్ రాంకిషన్ ఇంట్లోకి వరద చేరడంతో కుటుంబీకులు ఇబ్బందులు పడ్డారు.

ఉట్నూర్ రూరల్, జూలై 8: మండలంలో భారీ వర్షం కురిసింది. చెరువులకు కొంత నీరు వస్తుంది. చెరువులు నిండుకుంటేనే రైతులు వరి నాట్లు ప్రారంభిస్తారు.

నార్నూర్, జూలై 8 : నార్నూర్, గాదిగూడ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గాదిగూడ మండల లోని ఖడ్కి, లోకారి(బీ), అర్జుని లోలెవల్ కల్వర్టులపై వరద పారడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు. లోకారి(బీ) కల్వర్టులో ఆటో ఇరుకుపోవడంతో ప్రయాణికుల సహాయంతో బయటకు తీశారు. బారిక్‌రావ్‌గూడ, మారుతిగూడ, దన్నుగూడ ఒరెలపై వంతెనలు లేకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు బయటకు రాలేని దుస్థితి, ఒరెలపై వంతెనలు నిర్మించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

దస్తురాబాద్, జూలై 8 : మండలంలో సోమవారం గంటకుపైగా భారీ కురిసింది. రోడ్లు, పంట పొలలు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు,పొంగి పొర్లాయి. చెరువులోకి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. కురిసిన వర్షానికి మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. మండలంలో 26 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఉండవద్దు అని సూచిస్తున్నారు.

రైతులపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ముథోల్, జూలై 8 : రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9వ తేదీన చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికీ చేయలేదని అన్నారు. రైతుబంధు సంవత్సరానికి రూ. 15 వేలు ఇస్తానని ఇవ్వడం లేదని, అలాగే పంట నష్టం పసల్ బీమా యోజన అదుపులోకి తెస్తే రైతులకు న్యాయం జరుగుతుందని, అదేవిధంగా రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇవ్వడం లేదని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఉపసర్పంచ్ మోహన్, ధర్మపురి శ్రీనివాస్, బత్తినోడు సాయి, రాజేశ్ ఉన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

నర్సాపూర్(జి) : ప్రజాప్రతినిధులును సన్మానిస్తున్న అధికారులు

నర్సాపూర్(జి), జూలై 8: జడ్పీటీసీ, ఎంపీటీసీల సహకారంతో, అధికారుల సమన్వయంతో ఐదు సంవత్సరాలుగా మండలంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎంపీపీ కొండ్ర రేఖ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం పదవీ కాలం ముగిసిన మాజీ ఎంపీపీ కొండ్ర రేఖా రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మి, మాజీ జడ్పీటీసీ చిన్న రామయ్య, మాజీ ఎంపీటీసీలు మల్లేశ్, నర్సమ్మ, రాజవ్వలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో తుల పుష్పలత, అల్లాడి వనజ, కోఆప్షన్ సభ్యుడు ఫసి, ఇన్‌చార్జి ఏపీవో జగన్నాథం, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, నాయకులు, పశువైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్, జూలై 8 : బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను సోమవారం సోనాల యువకులు సన్మానించారు. కార్యక్రమంలో సోనాల యువకులు పాల్గొన్నారు.

బోథ్, జూలై 8 : బోథ్ మాజీ జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణిని బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, మైనార్టీ ప్రెసిడెంట్ రఫీ, బీసీ ప్రెసిడెంట్ రమణ, ఎల్క రాజు, రమేశ్ పాల్గొన్నారు.

బోథ్: మాజీ జడ్పీటీసీ సంధ్యారాణిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జైనథ్ : మాజీ ఎంపీటీసీ కోల భోజన్నను సన్మానిస్తున్న గ్రామస్తులు

జైనథ్, జూలై 8 : గిమ్మ, అకోలి గ్రామాలాభివృద్ధి పనుల్లో మాజీ ఎంపీటీసీ కోల భోజన్న కీలకమైన పాత్ర పోషించారని మాజీ ఎంపీపీ గోవర్ధన్ అన్నారు. సోమవారం గిమ్మ గ్రామంలోని రైతు వేదికలో ఇటీవల పదవీ విరమణ పొందిన మాజీ ఎంపీటీసీ కోల భోజన్నను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి, గజానన్, సంజీవ్, దేవన్న, కోల వినోద్, షేక్ అబ్దుల్ పాల్గొన్నారు.

రోడ్లపై ఉన్న ఆక్రమణల తొలగింపు

రోడ్లపై ఉన్న దుకాణాలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

నిర్మల్ అర్బన్, జూలై 8 : నిర్మల్‌లోని వివేకానంద చౌక్ వద్ద ప్రధాన రహదారి వెంబడి ఉన్న పండ్ల దుకాణాలను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. పట్టణ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురుకావడంతో మొదటి దశలో వివేకానంద చౌక్ నుంచి కిషన్ షాపింగ్ మాల్ వరకు ఉన్న పండ్ల దుకాణాలు, రోడ్లపై ఉన్న దుకాణ బోర్డులను జేసీబీ సహాయంతో తొలగించారు. రెండో దశలో తొలగింపు పనులు చేపడుతామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, టీపీఎస్ నవీన్, మున్సిపల్ అధికారులు, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

దిలావర్‌పూర్, జూలై 8 : విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలని తహసీల్దార్ స్వాతి అన్నారు. సోమవారం న్యూలోలం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వానకాలంలో కావడంతో సీజన్ వ్యాధులు రాకుండా, పాఠశాల చుట్టు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన పనుల గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం సమస్య లేకుండా చూడాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా రాంరావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన

పూజలు చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, జూలై 8 : ముథోల్ మండలం విట్టోలి తండా గ్రామంలో బాబుసింగ్ మహారాజ్ (పౌరాదేవి) ఆధ్వర్యంలో సోమవారం రాంరావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపడం కోసం ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌బాబు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, తండావాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్ రూరల్, జూలై 8: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కుమ్రం భీం స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. చదువుతో పాటు అవకాశాన్ని బట్టి ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. స్టడీ సర్కిల్ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కంప్యూటర్, బుక్స్, ఇతర వసతులు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, జూలై 8 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదవాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోనాల జడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమ